

# నేను - నా జ్ఞాపకాలు

## - జీడిగుంట రామచంద్రమూర్తి



*రచనా కాలం: 2019*

*(గత సంచిక తరువాయి)*

విమానం ఆగిన పదినిమిషాలకు ఒక స్ట్రెచర్‌ను తీసుకొచ్చారు లోపలకు. స్పృహ కోల్పోయినట్టున్న ఓ వ్యక్తిని దానిమీదకు చేర్చి బయటకు తీసుకెళ్ళారు. ఆ తర్వాత 'ఎగ్జిట్ గేట్ తెరిచారు. నేను, ముఖర్జీ గారూ బయటకు చేరుకున్నాం. బయట హోరున వర్షం కురుస్తున్నట్టు గ్రహించాం. నన్ను రిసీవ్ చేసుకోవటానికి వచ్చిన మా చిన్నబ్బాయి వేణుగోపాల్, నా భార్య కనిపించారు. విమానంలో జరిగిన హడావుడి ఏదీ వాళ్ళకు తెలియలేదట.

న్యూయార్క్ సిటీలోని వీధులన్నీ వర్షం నీటితో మునిగివున్నాయి. వేర్వేరు దారుల్లోంచి కారు డ్రైవ్ చేస్తూ నన్ను ఇంటికి చేర్చాడు మా అబ్బాయి. జరిగిన సంగతి యావత్తూ తెలుసుకుని “మొత్తానికి గండం గడిచిందన్నమాట!" అన్నాడు.

ఆ తరువాత 2005 లోనూ, 2009 లోనూ 2011 లోనూ, ఆఖరిసారి 2018 లోనూ మరో నాలుగుసార్లు అమెరికా వెళ్ళాను. వెళ్ళినప్పుడల్లా ఆనాటి ఆ సంఘటన గుర్తుకొచ్చి నవ్వుకుంటాను. ధైర్యం తెచ్చుకుంటాను.

2018 లో మరో మధురమైన సంఘటన జరిగింది. మా నాన్నగారి వంశవృక్షానికి సంబంధించిన కుటుంబ సభ్యులందరూ కలిసి, అమెరికాలోని గ్రేట్ వ్యాలీలో జూన్ 22, 23, 24 తేదీల్లో ఓ అపూర్వ సమ్మేళనాన్ని ఏర్పాటు చేశారు. మొత్తం 54 మందిమి పాల్గొన్న ఆ సమ్మేళనానికి అమెరిక దేశంలోని వేర్వేరు రాష్ట్రాల్లో వుంటున్న మా కుటుంబాల సభ్యులందరూ, విమానాల్లోనూ, కార్లలోనూ వచ్చి పాల్గొన్నారు. కేవలం తొమ్మిది మంది కుటుంబ సభ్యులు ఇండియాలోనే ఉండిపోవటంవల్ల హాజరు కాలేకపోయారు.

ఆ మూడు రోజులూ ఆటపాటలతో, విందు వినోదాలతో అందరం సరదాగా గడిపేశాం!

ఆ తర్వాత మూడు నెలలకు మా కుటుంబంలో ఓ విషాద సంఘటన చోటు చేసుకుంది. అమెరికా పర్యటనకు వెళ్ళిన నా పెద్ద తమ్ముడికి హఠాత్తుగా అస్వస్థత చేసి హ్యూస్టన్ లోని ఆస్పత్రిలో చేరి అర్థాంతరంగా కన్నుమూశాడు. ఇప్పటికీ ఆ దుర్ఘటన మమ్మల్నందర్నీ మనోవేదనకు గురిచేస్తూనే ఉంది!

నా అమెరికా యాత్ర పక్కన పెడితే మనదేశంలోని పుణ్యక్షేత్రాల దర్శనభాగ్యంకూడా నాకు అనేకసార్లు లభించింది. నాకు గుర్తున్నంతవరకూ షిర్డీ క్షేత్రానికి ఎక్కువసార్లు అంటే సుమారు 15 సార్లయినా వెళ్ళివుంటాను. అలాగే తిరుపతి, శ్రీశైలం, అన్నవరం, సింహాచలం, యాదగిరిగుట్ట వగైరా క్షేత్రాలకు కూడా పలుసార్లు వెళ్ళటం జరిగింది. నా మిత్రులు శ్రీ సుబ్బరాయశర్మ శ్రీకామేశ్వరశర్మ, శ్రీరఘురాం, శ్రీఓలేటి పార్వతీశం ప్రభృతులతో కలిసి దంపత సమేతంగా అందరం దేశంలోని జ్యోతిర్లింగాలు శక్తి పీఠాలూ వున్న ప్రాంతాల్ని కూడా సందర్శించటం, నాకు దొరికిన మహదవకాశంగా భావిస్తాను. కాశీ వెళ్ళి ఆ విశ్వేశ్వరుణ్ణి దర్శించుకునే మహద్భాగ్యం కూడా నాలుగుసార్లు చేకూరింది. అన్నట్టు శివరాత్రి పుణ్యదినాన అర్ధరాత్రి సమయాన శ్రీశైలంలోని గర్భగుడిలో కూర్చుని ఆకాశవాణి కేంద్రాల ద్వారా ప్రసారం కావటానికి రెండుసార్లు ప్రత్యక్ష వ్యాఖ్యాసం కూడా చేశాను. ఇవన్నీ ఆ పరమశివుడు ప్రసాదించిన అవకాశాలుగానే భావిస్తాను.

ఇంతవరకూ ఒక కథారచయితగానూ, నవలా రచయితగానూ, రేడియో–టీవీ మాధ్యమాల రచయితగానూ మాత్రమే కాకుండా కాస్తో కూస్తో పేరు వచ్చాక, శ్రీ ఆదివిష్ణు గారి స్నేహంతో సినీరంగంలో కూడా కాలు పెట్టానని చెప్తూ– ఆయా వ్యవస్థలకు చెందిన నా జ్ఞాపకాల్ని ప్రస్తావించాను కదా!

ఇక ఇప్పుడు నా కుటుంబ సభ్యులతో గడిపిన రోజుల్ని కూడా మీ ముందు జ్ఞాపకం చేసుకుంటాను. కుటుంబానికి మూలాలు తల్లిదండ్రులు. మా నాన్నగారు 1916 లో జన్మిస్తే, మా అమ్మ 1920 ప్రాంతాల్లో జన్మించినట్టు తెలుసుకున్నాను. మా నాన్నగారి పుట్టినరోజు వేడుకల్ని మేం ఎప్పుడూ జరపలేదు. ఆయనే ఓ కొత్త షర్టు కొనుక్కుని వేసుకోవటం, మా అమ్మ ఏ పాయసమో చేయటం గుర్తుంది.

1976 లో ఆగస్టు 8 వ తేదీన మా నాన్నగారి షష్టిపూర్తిని జరపాలని నిర్ణయించుకుని, ఆయన్ని నిడదవోలునుంచి ఆహ్వానించి, స్థానిక కమ్యూనిటీ హాలులో నా చెల్లెలు, బావగారు, తమ్ముళ్లు, ఇతర బంధుగణాన్ని ఆహ్వానించి ఆ వేడుకను ఘనంగా నిర్వహించాం.

అప్పటినుంచీ ప్రతి ఏడూ ఆయన పుట్టినరోజు వేడుకను నా ఇంట్లోగానీ, నా చెల్లెలూ, తమ్ముళ్ళ ఇళ్ళల్లోగానీ జరపటం ఆనవాయితీగా మారిపోయింది! 1994 లో ఆయన పుట్టినరోజు వేడుకను, మల్కాజిగిరిలో వుంటున్న నా పెద్ద తమ్ముడు ఇంట్లో జరుపుకున్నాం. మధ్యాహ్నం విందు భోజనం అయ్యాక, కేక్ కట్ చేయించాం. ఆ తర్వాత కాఫీ టిఫిన్లు ముగించి, చీకటి పడుతున్నవేళకు, మేం ఎవరి ఇళ్ళకు వాళ్ళం తిరుగు ప్రయాణమయ్యాం. సరిగ్గా అదే క్షణంలో మా అమ్మ 'ఆయాసంగా వుందర్రా'– అంటూ కుర్చీలో కూర్చుండిపోయింది. మా నాన్న డాక్టరే కదా! వెంటనే అమ్మని తన మంచం మీద కూర్చోపెట్టుకుని పరీక్ష చేసి, ఏదో మాత్ర తెమ్మని నా తమ్ముణ్ణి పంపించాడు. వాడు వచ్చేలోగానే అమ్మకి ఆయాసం ఎక్కువైంది. నాన్న తొడలమీదకు వాలిపోయింది. మూసినకన్ను తెరవలేదు. 74 సంవత్సరాల వయసులోనే అమ్మ అలా

ప్రశాంతంగా నిష్క్రమించినా మా అందరినీ మనోవేదనకు గురిచేసింది ఆ సంఘటన!

ఆవిడ వెళ్ళిపోయిన ఓ నెలరోజులకు మానాన్న తిరిగి నిడదవోలు ప్రయాణమయ్యారు. ఆయన్ని వెళ్ళవద్దన్నాం. మా దగ్గరే వుండిపొమ్మన్నాం. ఆయన వినలేదు. "వీలైనప్పుడల్లా వస్తుంటాను కదరా" అంటూ వెళ్ళిపోయారు. అప్పటినుంచీ 2001 వ సంవత్సరం వరకూ ఆ ఊరిలోనే వుంటూ అడపాదడపా హైదరాబాదు వస్తూ గడిపారు.

2001 లో మా అమ్మ 'ఏన్యువల్ సెరిమనీ' బోరబండలో వుంటున్న నా చిన్నతమ్ముడి ఇంట్లో పెడుతుంటే నాన్న అక్కడికి వచ్చారు. 'సెరిమనీ" అయిం తర్వాత, నా చెల్లెలు ఇంటికి శాంతినగర్ కి వెళ్ళారు. అక్కడ రెండు మూడు రోజులుండి నా దగ్గరకు రావాల్సి వుంది. ఇంతలో రెండో రోజునో, మూడో రోజునో హఠాత్తుగా ఆయనకు వీపునొప్పి వచ్చింది.

నా చెల్లెలు నాకు ఫోన్ చేసి చెప్పింది. వెంటనే ఒక టాక్సీని మాట్లాడుకుని వాళ్ళింటికి వెళ్ళి నాన్నను ఆస్పత్రిలో చూపిద్దామని టాక్సీలో కూర్చోమన్నాను. నా పక్కనే కూర్చున్నారు. నా భుజంపై తల పెట్టుకుని కూర్చున్న నాన్న అయిదు నిమిషాలు గడిచేసరికి తల వాల్చేశారు. కళ్ళు మూతలు పడ్డాయి.

నేను కంగారుపడి దారిలోనే వున్న మహావీర్ ఆస్పత్రి దగ్గర టాక్సీ ఆపించాను. స్ట్రెచర్ తెమ్మన్నాను దానిమీద. పడుకోబెట్టిన తర్వాత డాక్టర్ వచ్చి చూసి, "సారీ! హి ఈజ్ నో మోర్" అన్నారు.

అలా ఏడేళ్ళ వ్యవధిలో అమ్మనాన్నలు ఇద్దరూ మమ్మల్ని వదిలి వెళ్ళిపోయారు. వాళ్ళ స్మృతుల్ని జ్ఞాపకం చేసుకుంటూ మేం రోజుల్ని గడుపుతున్నాం. మా అమ్మ 1994 లో కన్నుమూశాక నా భార్య శ్రీమతి రాజ్యలక్ష్మి నాకు అమ్మగా మారింది. నా చెల్లెలుకీ, తమ్ముళ్ళ కుటుంబాలకీ దాదాపు తనే పెద్ద దిక్కైంది. అసలు నేను పూర్వజన్మలో ఎంతో పుణ్యం చేసుకోవటం వల్లనే తను నాకు భార్యగానూ, ఎన్నో దానధర్మాలు చేసి వుండటంవల్లనే నా కుమారులు ముగ్గురూ ఈ జన్మలో లభించారని నేను అనుకుంటుంటాను.

1961 లో నా వివాహం అయ్యే సమయానికి నాకు 21 సంవత్సరాలు. నా భార్యకి 18 సంవత్సరాలు నిండాయి! ఒకరకంగా ఈ రోజులతో పోలిస్తే ఆ రోజులలో మాది బాల్యవివాహం అని చెప్పుకుంటూంటాను. 1962 లో మా పెద్దబ్బాయి పుట్టాక, కాకినాడలో నాకు గవర్నమెంటు ఉద్యోగం రావటంతో అక్కడికి నేను మకాం మార్చిన తర్వాత– మా కుటుంబంలో ఒడిదుడుకులు ప్రారంభమయ్యాయనే చెప్పుకోవాలి.

అప్పట్లో నెలకు 90 రూపాయలు జీతం వస్తుంటే నెలకు 30 రూపాయలు ఇంటి అద్దెకి మరో 30 రూపాయలు పాలకు అయిపోతే తక్కిన 30 రూపాయలు ఇంటి ఖర్చులకు సరిపోయేవికాదు. నెలాఖరు వచ్చిందంటే నా భార్య పక్కింటి

పిన్నిగారిని అడిగి పదిరూపాయలూ, ఇరవై రూపాయలు చేబదులు తీసుకొచ్చి ఇల్లు గడిపేది. రానురాను నాకు మరో ఇద్దరు అబ్బాయిలు పుట్టేటప్పటికి ఖర్చులు పెరిగాయి. 1965 లో రాజమండ్రి బదిలీ అయి వచ్చాను. ఇంటికి ఎవరైనా బంధువులు వస్తే వాళ్లను ఆదరించి పంపటానికి ఎదురయ్యే ఆర్థిక ఇబ్బందుల్ని పరిష్కరించుకోవటానికి ఇంట్లో వున్న వెండి గ్లాసులూ, వెండి పళ్ళాలూ నా చేతికిచ్చి మార్వాడీషాపులో అమ్మి డబ్బు తెమ్మంటే తెచ్చేవాణ్ణి.

అలా దాదాపు అయిదారేళ్ళు గడిచాక 1971 చివర్లో నాకు రేడియో ఉద్యోగం రావటంతో కొంచెం కుదుటపడ్డాం. అయినా అప్పటికి పిల్లలు ముగ్గురూ హైస్కూలు చదువులకు రావటంతో మళ్ళీ ఆవో రకమైన ఆర్థిక సమస్యలు. పక్కింటి అమ్మమ్మగార్నీ, ఎదురింటి ఆంటీ గార్నీ అప్పు అడిగి డబ్బు తెచ్చేది నా భార్య. నా ముగ్గురు పిల్లల చదువుసంధ్యల విషయాల్నీ తనే చూసుకునేది తప్ప నా నోటీసులోకి తీసుకొచ్చేదికాదు. దేనికీ కోపంగానీ, విసుగునుగానీ ప్రదర్శించటం నాకు తెలీదు.

1984 లో నా రెండవ కుమారుడు శ్రీధర్ బి.ఎస్సీ పాసయి వెంటనే ఆంధ్రాబ్యాంకులో క్లర్కుగా చేరాడు. అక్కడితో మాకు మంచి రోజులు ప్రారంభమయ్యాయి. దేనికీ ఇబ్బంది పడకుండా రోజుల్ని గడపసాగాం. పెద్దబ్బాయి ఇంజనీరింగ్ ఎంట్రన్స్ రాశాడు. మంచి ర్యాంకు రాకపోవటంతో బి.ఎస్సీలో చేరాడు. మళ్ళీ ఏడాది తిరిగాక మరోసారి ఎంట్రన్స్ రాశాడు. అప్పుడూ ర్యాంకు రాలేదు. రెండేళ్ళు బి.ఎస్సీ పూర్తయ్యాక అప్పుడు వానికి ఇంజనీరింగ్ సీటు వచ్చింది. ఉస్మానియా యూనివర్సిటీలో చేరాడు. ఆ తర్వాత రెండేళ్ళకు నా చిన్న కొడుకు వేణుగోపాల్ కూడా ఇంటర్ పాసై ఇంజనీరింగ్ ఎంట్రన్స్ రాసి, మంచి ర్యాంకు తెచ్చుకోవటంతో, వానినీ ఉస్మానియాలోనే ఇంజనీరింగ్ లో చేర్పించాను.

అలా పెద్దవాడూ, చిన్నవాడూ ఇంజనీరింగ్ చదివారంటే అందుకు ప్రేరణ, కారణమూ నా ఇల్లాలే! 'ఆలయాన వెలసిన ఆ దేవుని రీతి- ఇల్లాలే ఈ జగతికి జీవనజ్యోతి' అనే పాటలోని పల్లవి నా భార్యకి సూటికి నూరుపాళ్లూ వర్తిస్తుందని నా నమ్మకం.

తను ఎనిమిదో క్లాసు కూడా చదివిందో లేదో కానీ తనకున్నంత లోకజ్ఞానం నాకు సైతం లేదేమో అని నాకనిపిస్తుంది. ఇందులో ఏమాత్రం అతిశయోక్తి లేదు. మా కుటుంబసభ్యులతోపాటు మా తమ్ముళ్ళ కుటుంబ సభ్యుల పుట్టినరోజులూ, పెళ్ళిరోజులూ అన్నీ గుర్తు పెట్టుకుని అందరికీ ఆయా రోజుల్లో తనే శుభాకాంక్షలు చెప్తూంటుంది!

ఇక నా పిల్లలు నన్ను 'నాన్న'లా కాకుండా తమ బిడ్డలా చూసుకుంటారు. చూసుకుంటూనే వున్నారు. అడక్కపోయినా నాకు అన్ని సదుపాయాలూ సమకూరుస్తూ వుంటారు. వాళ్ళు తమ ఋణం తీర్చుకునేందుకు నాకు బిడ్డలుగా పుట్టారో లేక నన్నే ఋణగ్రస్తుడ్ని చేయటానికి పుట్టారో అర్థంకాదు.

చిన్న కుమారుడు వేణు ఇంజనీరింగ్ కాగానే హెచ్.ఎ.ఎల్.లో మూడు సంవత్సరాల దాకా ఉద్యోగం చేసి డబ్బు సంపాదించుకుని ఆ తర్వాత నన్ను ఒక్క రూపాయి కూడా అడక్కుండా ఎం.బి.ఏ. చదువుకునేందుకు 1992 లో అమెరికా వెళ్ళిపోయాడు. తర్వాత అక్కడే ఉద్యోగం సంపాదించుకున్నాడు.

1988 లో నా పెద్దకొడుకు సారథి బరంపురంలో ఫిజిక్స్ ప్రొఫెసర్ గా పనిచేస్తున్న ఎర్రమిల్లి రాఘవరావు సుబ్బలక్ష్మి దంపతుల జ్యేష్ట పుత్రిక చి ॥ సౌ ॥వెంకటరమణిని వివాహం చేసుకుని, హైదరాబాద్ లోనే ఆరేళ్ళు ఉద్యోగం చేసుకుని, ఇద్దరు పిల్లలకు తండ్రయి ఆ తర్వాత 1994 లో అమెరికాలో ఉద్యోగం సంపాదించుకుని కుటుంబ సమేతంగా అక్కడకు వెళ్ళాడు. వాని కుమారుడు వరుణ్ సందేశ్ అమెరికాలో ఇంటర్ వరకూ చదివి తర్వాత హేపీడేస్ సినిమాలో నటించేందుకు ఇండియా వచ్చి ఇక్కడే నటుడిగా స్థిరపడ్డాడు.

భీమవరం వాస్తవ్యులైన శివాజీ, అనంతలక్ష్మి దంపతుల పెద్ద కుమార్తె చి ॥ సౌ ॥ వితికను 2016 లో వివాహం చేసుకున్నాడు. వరుణ్ సందేశ్ చెల్లెలు వీణాసాహితి, నెల్లూరులో మెడిసిన్ చదివి అమెరికా వెళ్ళిపోయి, నెల్లూరు వాస్తవ్యులైన శ్రీ మూర్తిరాజు కమలాకర్, ఉష దంపతుల కుమారుడు నితిన్ చంద్రను పెళ్ళి చేసుకుని ప్రస్తుతం ఫ్లోరిడాలో వుంటోంది.

నా రెండవ అబ్బాయి శ్రీధర్ బ్యాంకు ఉద్యోగం చేసుకుంటూనే, మరోవైపు అడపాదడపా టీ.వీ. సీరియల్స్ లో వేషాలు కూడా వేస్తూ 1990 లో పాలకొల్లు వాస్తవ్యులైన శ్రీ సూరంపూడి వెంకట సూర్యప్రకాశరావుగారి జ్యేష్ట కుమార్తె చి॥ సౌ॥రామలక్ష్మిని పెళ్ళి చేసుకున్నాడు. తను కూడా ఇద్దరు పిల్లలకు తండ్రయ్యాడు. వానికి ముందు అబ్బాయీ, తర్వాత అమ్మాయి జన్మించారు. వాళ్ళిద్దరూ పెరిగి పెద్దయి ఇంజనీరింగ్ పాసయ్యారు.

అబ్బాయి హైదరాబాద్ వాస్తవ్యులు శ్రీ కిళాంబి శ్రీనివాస్ చూడామణి దంపతుల జ్యేష్ఠ కుమార్తె చి॥సౌ॥ శ్రావణిని పెళ్ళి చేసుకుని అమెరికాలో ఉద్యోగానికి వెళ్ళి అక్కడే స్థిరపడ్డాడు. ఇక అమ్మాయి పూజాలహరి హైదరాబాద్ లోనే ఓ సాఫ్ట్ వేర్ కంపెనీలో ఉద్యోగం చేసుకుంటోంది.

ఇక చిన్నవాడు వేణుగోపాల్. తను కూడా అమెరికాలోనే స్థిరపడి 1996 లో ఇండియా వచ్చి, హైదరాబాద్ వాస్తవ్యులైన శ్రీ తటవర్తి రామకృష్ణ సత్యనారాయణ, లీలావతి దంపతుల చిన్న కూతురు చి॥సౌ॥ కిరణ్మయిని పెళ్ళి చేసుకుని ఇద్దరు పిల్లలకు నాన్నయ్యాడు. పిల్లలిద్దరూ కాలేజీలో చదువుతున్నారు. పెద్ద కొడుకు పేరు స్ఫూర్తీ రామచంద్ర .. చిన్న వానిపేరు సమర్టి రాజ్యలక్ష్మణ!

అన్నట్టు రెండేళ్ళ క్రితమే నా పెద్ద మనుమరాలు సాహితి ఓ ఆడపిల్లకు తల్లయి నన్ను ముత్తాతను చేసింది. ఇక్కడ మరో ముఖ్య విషయం కూడ చెప్పాలి. నా కోడళ్లు ముగ్గురూ తల్లితండ్రుల వాత్సల్యాన్ని చూపుతారో నా శ్రీమతి పట్ల, నాపట్ల కూడా అలాంటి వాత్సల్యాన్నే చూపిస్తారు.

ఇక నా తమ్ముళ్ల విషయానికి వస్తే పెద్దతమ్ముడు కొడుకు సాయి రామకృష్ణ కూతురు చి॥సౌ॥ మాధవీలత, రెండవ తమ్ముని కుమార్తెలు చి ॥ సౌ॥లక్ష్మీపద్మజ, చి॥ సౌ॥ లక్ష్మీ శైలజ, చిన్న తమ్ముని కుమారులు సాయి శ్రీనివాస్, భాస్కర రామకృష్ణ. వీరందరూ కూడా వివాహితులై కుటుంబాల సమేతంగా అమెరికాలోని వేర్వేరు రాష్ట్రాల్లో ఉద్యోగాలు చేసుకుంటూ సుఖజీవనాలు సాగిస్తున్నారు.

నా అత్తగారి తరపు బంధుగణం కూడా నాకు ఎక్కువే. నా భార్యకు ఇద్దరు అన్నయ్యలున్నారు. పెద్ద అన్నయ్య శ్రీ పెమ్మరాజు శ్రీరామ సూర్యనారాయణ శర్మ రైల్వేలో ఇంజనీర్‌గా పనిచేసి రిటైరై బిలాసపూర్ లో సెటిలయ్యారు. ఆయనకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. రెండవ అన్నయ్య హనుమంతరావు, బల్లిపాడు కరణంగా పనిచేసి, రిటైరై ప్రస్తుతం తణుకులో వుంటున్నాడు. ఇద్దరు బావమరుదులకూ నేనంటే ప్రేమాభిమానాలు ఎక్కువ. హనుమంతరావుకు కూడా ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె వున్నారు. ఆ ఇద్దరు అన్నయ్యలతోపాటు నాభార్యకు ఇద్దరు చెల్లెళ్ళు కూడా వున్నారు.

పెద్ద చెల్లెలు చి॥ సౌ॥ పద్మావతికి ఇద్దరు కుమార్తెలు. పెద్ద కుమార్తె చి ॥ సౌ ॥ విజయలక్ష్మి శ్రీ మారెళ్ళ కృష్ణారావుని పెళ్ళి చేసుకుని ఒక కుమార్తెకు మాతృమూర్తి అయి హైదరాబాద్ లో కాపురం వుంటోంది. చిన్న కుమార్తె చి ॥ సౌ॥త్రిపురకు నేనే కన్యాదానం చేశాను. ఈమె భర్త శ్రీ గోవిందరాజు శేఖర్ తో ఇద్దరు మగపిల్లలకు తల్లయి, కుటుంబ సమేతంగా హైదరాబాద్లోనే వుంటోంది.

ఇక చిన్న చెల్లెలు చి ॥ సౌ ॥ లలితకు కూడా నేనే కన్యాదానం చేశాను. భర్త శ్రీ మునిపల్లె హనుమంతరావుతో హైదరాబాద్ లో స్థిరపడింది. ఈ జంటకు ఒక అబ్బాయి, ఒక అమ్మాయి వున్నారు. అయితే అబ్బాయి నాగేశ్వరరావు డిఫెన్స్ లో పైలట్ ఆఫీసర్ గా పనిచేస్తూ కారు ప్రమాదంలో కన్నుమూశాడు. అతని భార్య శ్రీమతి శ్రీసుధ ఇద్దరు మగపిల్లలతో హైదరాబాద్ లో వుంటోంది. ఇక అమ్మాయి చి ॥ సౌ ॥ సరస్వతి శ్రీ బలిజేపల్లి కిరణ్ ని పెళ్ళి చేసుకుని ఇద్దరు పిల్లలతో అమెరికాలో స్థిరపడింది.

అలా బావమరుదులు, మరదళ్ళ విషయానికొస్తే నా పిన్నత్తగార్లకు కూడా పలువురు పిల్లలున్నారు. వారందరూ నన్నూ నా శ్రీమతినీ ఎంతో గౌరవిస్తారు. అందరిలోనూ నేను ముఖ్యంగా చెప్పుకోవాల్సినవారు ఇద్దరున్నారు. వాళ్ళు చి ॥

సత్యవోలు కేశవకుమార్, చి॥ సత్యవోలు సుందరసాయి. ఈ ఇద్దర్నీ ప్రత్యేకంగా ఎందుకు పేర్కొంటున్నానంటే నేను ఆకాశవాణిలో చేరిన తొలి సంవత్సరాల్లోనే వీరిద్దరూ, కాలేజీ చదువుకోసం హైదరాబాద్ వచ్చేసి మా ఇంటికి దగ్గర్లోనే మకాం పెట్టి మాతో ఎంతో కలిసికట్టుగా వుండేవారు. అలా వాళ్లిద్దరూ నా కొడుకులతో సమానంగా ప్రేమాభిమానాలు పొందారు. ఇద్దరూ ఎంతో అభివృద్ధిలోకి వచ్చారు. పెద్దవాడు కేశవకుమార్ వ్యాపారంలో పైకొస్తే చిన్నవాడు దూరదర్శన్ లో ఉద్యోగం సంపాదించుకుని పేరు తెచ్చుకున్నాడు. కేశవకుమార్ నాకు గుర్తుండి, గత 20 సంవత్సరాలుగా ప్రతి 'న్యూ ఇయర్స్ డే' నాడు నన్ను కలిసి ఖరీదైన పెన్ను, డైరీ, స్వీట్ల ప్యాకెట్ ఇచ్చి ఆశీస్సులు తీసుకుంటూంటాడు.

ఇలా నా జ్ఞాపకాల్ని తవ్వుకుంటూ రాస్తే ఎన్నో ఎన్నెన్నో వుంటాయి. అవన్నీ రాసుకుంటూపోతే మీలో ఆసక్తి సన్నగిల్లే ప్రమాదం వుంది. అందుకని చివర్లో ఒక్క నాలుగు వాక్యాలు రాసి ముగింపు పలుకుతాను.

ఆరోగ్యమే మహాభాగ్యం అంటారు కదా! నా ఎనభై వళ్ళ జీవితంలో మా కుటుంబసభ్యుల ఆరోగ్యాన్ని కాపాడుతూ అన్నివేళలా అడిగిందే తడవుగా ఫోన్లో సైతం సలహాలు ఇస్తూ మా క్షేమ సమాచారాల్ని విచారిస్తూ కాపాడుతున్న వైద్యుల్ని మరిచిపోతే ఆ దేవుళ్ళనే మర్చిపోయినట్టవుతుంది.

విజయనగర కాలనీలో వుంటూ చిన్న క్లినిక్ తెరుచుకుని వైద్యం చేసుకునే శ్రీ కె రామకృష్ణారావు గారు 1972 నుంచీ మా ఇంట్లో మా పిల్లలకూ మాకు ఎవరికి ఎలాంటి ఆరోగ్య సమస్య వచ్చినా, చూసి తగు వైద్యం చేస్తూండేవారు. ఇక కేంద్ర ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాలు తెరిచిన తర్వాత, బేగంపేట సి.జి. హెచ్.ఎస్.లో స్పెషలిస్టుగా పనిచేసిన శ్రీ ఎన్. శ్రీనివాస్ గారూ ఇక ఇపుడు అదే సి.జి. హెచ్.ఎస్.లో ఆరోగ్య అధికారిగా వుంటున్న డా. కె.వెంకటేశ్వరరావుగారూ వీరందరూ మా కుటుంబసభ్యుల్లా మారిపోయి, అవసరమయినపుడల్లా వైద్యం చేస్తూ మా పాలిట దేవుళ్ళయ్యారు. వారికందరికీ వినమ్రుడనై నమస్కరిస్తున్నాను.

అలాగే నా కుమారులు ముగ్గురికీ ఎందరో మంచి స్నేహితులున్నారు. వారిలోని మంచితనాన్ని నాకు కూడా పంచుతూ వారంతా నన్ను కూడా తమ తండ్రిలా గౌరవిస్తారు. వారికందరికీ కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను.

ఇంకా ఎందరో బంధువులు మిత్రులు వున్నారు. వారిలో కొందర్ని నేను మర్చిపోయి వుండచ్చు. వారికీ, నా ఆకాశవాణి మిత్రులకూ, దూరదర్శన్ లో నాకు అవకాశాలిచ్చిన ఉద్యోగులకు ప్రెస్ క్లబ్ సభ్యమిత్రులకూ అందరికీ నా కృతజ్ఞతాభివందనాలు తెలుపుకుంటూ–నా మనసు పొదల్లోంచి అందించిన జ్ఞాపకాలకు ముగింపు పలుకుతున్నాను.

సెలవు

( వచ్చే నెలలో నాకు జ్ఞాపకం లేని "ఆ అరవై రోజులు")